# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

# విశాఖపట్నం కేంద్రం

# ప్రాంతీయ వార్తలు

తేదీ: 07-11-2025 సమయం : సాయంకాలం 6 గం. 10 ని.లు

## ముఖ్యాంశాలు

- ❖ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధ్యక్షతన ఈరోజు రాష్ట్ర స్థాయి పెట్టుబడుల ప్రోత్సాహక బోర్డు (ఎస్ఐపీబీ) సమావేశం జరిగింది.
- ❖ దేశ వ్యాప్తంగా స్వరాజ్య కాంక్ష, స్ఫూర్తిని రగిలించిన గేయం వందేమాతరం అని కేంద్ర సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాస వర్మ పేర్కొన్నారు.
- ❖ భవిష్యత్ అంతా పర్యాటక రంగానిదే అని మంత్రి కందుల దుర్గేష్ అభిప్రాయపడ్డారు.
- ❖ వెలిగొండ ప్రాజెక్ట్ ను 2026 నాటికి పూర్తి చేస్తామని మంత్రి నిమ్మల రామానాయుడు తెలిపారు.

====================

రాష్ట్రంలో పరిశ్రమల స్థాపనకు అవసరమైన భూములు, ఇంధన లభ్యత ఉండేలా చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధికారులను ఆదేశించారు. సచివాలయంలో ముఖ్యమంత్రి అధ్యక్షతన ఈరోజు జరిగిన 12వ రాష్ట్రస్థాయి పెట్టుబడుల ప్రోత్సాహక బోర్డు (ఎస్ఐపీబీ) సమావేశంలో 26 పరిశ్రమలకు సంబంధించిన ప్రతిపాదనలను ఎస్ఐపీబీ ఆమోదించింది. వీటి ద్వారా మొత్తం 1,01,899 కోట్ల రూపాయల పెట్టుబడులు రాష్ట్రానికి రానున్నాయి. అలాగే.. ఈ ప్రాజెక్టుల ద్వారా మొత్తంగా 85 వేల 570 ఉద్యోగ అవకాశాలు లభించనున్నాయి. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ... రాష్ట్రంలో వివిధ రంగాల్లో పెట్టుబడులు వచ్చేలా చూడటం అధికారుల బాధ్యత అని అన్నారు. పెట్టుబడిదారుల నుంచి ప్రతిపాదనలు తీసుకుని సమయం వృధా కాకుండా తక్షణం ఆమోదం తెలియచేయాలని, ప్రభుత్వం నుంచి ఆమోదం పొందిన పరిశ్రమలు, ప్రాజెక్టులు కార్యరూపం దాల్చేలా చూడాలని అధికారులకు సూచించారు.

====================

దేశ వ్యాప్తంగా స్వరాజ్య కాంక్ష, స్ఫూర్తిని రగిలించిన గేయం వందేమాతరం అని కేంద్ర భారీ పరిశ్రమల శాఖ సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ అన్నారు. విజయవాడ బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో వందేమాతరం 150 వసంతాల ఉత్సవం కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర అధ్యక్షులు పివిఎన్ మాధవ్ తో కలిసి ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా కేంద్రమంత్రి మాట్లాడుతూ.. తెల్లదొరలను తరిమి కొట్టేలా ఉద్యమ స్ఫూర్తి వందేమాతరం మంత్రం ద్వారా వచ్చిందన్నారు. దేశ

ప్రజలందరిలో వందేమాతర గీతం ఐక్యతను పెంపొందించిందని చెప్పారు. బంకిం చంద్ర ఛటర్జీ తీసుకున్న భూమికను నేటి తరాలకు చాటి చెప్పాలని భూపతిరాజు శ్రీనివాసవర్మ సూచిస్తూ ...

(వాయిస్ 28 సెకన్లు)

====================

భవిష్యత్ అంతా పర్యాటక రంగానిదే అని రాష్ట్ర పర్యాటక శాఖా మంత్రి కందుల దుర్గేష్ అన్నారు. లండన్ లో వరల్డ్ ట్రావెల్ మార్కెట్ -2025 (WTM) ప్రదర్శన అనంతరం ఇండియన్ హై కమిషన్ ఏర్పాటు చేసిన హై టీ కార్యక్రమంలో మంత్రి పాల్గొని ప్రసంగించారు. WTM ప్రదర్శనలో పాల్గొనడం సంతోషకరమని, ఇది రాష్ట్ర పర్యాటకానికి విస్తృత ప్రచారం కల్పించేందుకు గొప్ప వేదికగా నిలిచిందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా WTM సదస్సుకు వచ్చిన అంతర్జాతీయ పర్యాటక ప్రతినిధులను మంత్రి ఆంధ్రప్రదేశ్ కు ఆహ్వానించారు. రాష్ట్రంలో పర్యాటక రంగానికి పారిశ్రామిక హోదా ఉందని, నూతన పర్యాటక పాలసీని విడుదల చేశామని తెలిపారు. రాష్ట్రంలోని పర్యాటక ప్రదేశాలను సందర్శించి, పర్యాటక, ఆతిథ్య రంగాల్లో పెట్టుబడులు పెట్టడం ద్వారా రాష్ట్ర పర్యాటక అభివృద్ధికి దోహదపడాలని మంత్రి పెట్టుబడిదారులకు విజ్ఞప్తి చేశారు. అలాగే ఈ నెల 14, 15వ తేదీల్లో విశాఖలో జరగనున్న సీఐఐ భాగస్వామ్య సదస్సుకు వారిని ఆహ్వానించారు.

====================

వెలిగొండ ప్రాజెక్ట్ ను 2026 నాటికి పూర్తి చేస్తామని రాష్ట్ర జలవనరుల శాఖా మంత్రి నిమ్మల రామానాయుడు తెలిపారు. మొంథా తుఫాను ప్రభావంతో దెబ్బతిన్న వెలిగొండ ఫీడర్ కెనాల్ ను ఆయన ఈరోజు ఇరిగేషన్ నిపుణుల బృందంతో కలిసి పరిశీలించారు. అనంతరం దోర్నాలలో అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి విలేకరులతో మాట్లాడుతూ.. ఫీడర్ కెనాల్ కు మూడు ప్రాంతాల్లో గండ్లు పడ్డాయని, ఎగువ కురిసిన వర్షాలకు భారీగా వరద నీరు ఫీడర్ కెనాల్ నుంచి వెలిగొండ ప్రాజెక్టు సొరంగాలలోనికి కూడా చేరిందన్నారు. ముందు జాగ్రత్త చర్యగా అందులో పని చేస్తున్న 250 మంది కార్మికులను తుఫాను సమయంలో సురక్షితంగా బయటకు తీసుకువచ్చామని చెప్పారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు 15 రోజులకు ఒకసారి వెలిగొండ ప్రాజెక్ట్ గురించి సమీక్ష నిర్వహిస్తున్నారని మంత్రి తెలియజేశారు

విరామం

====================

ఆచార్య ఎన్జీ రంగా త్యాగనిరతి చిరస్మరణీయమని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అన్నారు. ఆచార్య ఎన్జీ రంగా 125వ జయంతి ఉత్సవాలను పురస్కరించుకొని గుంటూరు లాంఫారమ్ లోని ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ విశ్వవిద్యాలయంలో ఈరోజు జరిగిన కార్యక్రమంలో ముఖ్యమంత్రి పాల్గొని మాట్లాడుతూ.. మహాత్మా గాంధీ ప్రేరణతో క్విట్ ఇండియా ఉద్యమంలో పాల్గొని జైలు జీవితం అనుభవించిన త్యాగశీలి ఆచార్య ఎన్జీ రంగా అని కొనియాడారు. ఆయనలో ఒక స్వాతంత్ర్య సమరయోధుడు, గొప్ప రచయిత, సంఘ సేవకుడు ఉన్నారని అన్నారు. గ్రామీణుల జీవితాన్ని ఎన్జీ రంగా అర్థం చేసుకున్నారని చంద్రబాబు నాయుడు పేర్కొంటూ...

(వాయిస్ 30 సెకన్లు)

====================

ఆంధ్రప్రదేశ్ పారిశ్రామిక మౌలిక సదుపాయాల కల్పన సంస్థ (ఏపీఐఐసీ)కు రాష్ట్ర ప్రభుత్వం బోర్డు డైరెక్టర్లను నియమించింది. ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేస్తూ రాష్ట్ర వ్యాప్తంగా పలు జిల్లాల నుంచి 15 మంది సభ్యులను బోర్డు డైరెక్టర్లుగా నియమించింది. బోర్డు డైరెక్టర్లంతా రెండు సంవత్సరాల పాటు పదవిలో కొనసాగుతారని ఉత్తర్వుల్లో పేర్కొంది. బోర్డు డైరెక్టర్ల నియామక ప్రక్రియకు సంబంధించి కార్యాచరణ చేపట్టాలని ఏపీఐఐసీ ఎండీకి ఆదేశాలు జారీ చేస్తూ.. పరిశ్రమలు, వాణిజ్య శాఖ కార్యదర్శి ఎన్. యువరాజ్ ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేశారు.

====================

మహిళా క్రికెటర్, ICC ప్రపంచ కప్ ను సాధించిన టీమిండియా జట్టు సభ్యురాలు శ్రీచరణి ఈరోజు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడును మర్యాద పూర్వకంగా కలిశారు. ఉమెన్ వరల్డ్ కప్ గెలుచుకున్న ఆనంద క్షణాలను చంద్రబాబు నాయుడు, మంత్రి లోకేష్ లతో పంచుకున్న ఆమె.. తనకు మద్దతుగా నిలిచినందుకు వారికి కృతజ్ఞతలు తెలిపారు. ముఖ్యమంత్రి ఆమెను అభినందించి, ఉమెన్ వరల్డ్ కప్ గెలుచుకోవడం ద్వారా భారత దేశ మహిళల సత్తా చాటారని, మహిళా క్రీడాకారులకు ఆదర్శంగా నిలిచారని కొనియాడారు. శ్రీచరణి బృందం భవిష్యత్ లో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. 2.5 కోట్ల రూపాయల నగదు, కడపలో వెయ్యి చదరపు గజాల ఇంటి స్థలాన్ని శ్రీచరణికి రాష్ట్ర ప్రభుత్వం తరఫున బహుమతిగా ప్రకటించారు. అలాగే ఆమెకు గ్రూప్ 1 స్థాయి రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగం కూడా కల్పిస్తామని ముఖ్యమంత్రి తెలియజేశారు. ఈ సందర్భంగా శ్రీచరణి మాట్లాడుతూ.. అందరి ప్రోత్సాహంతోనే తాము మహిళా వరల్డ్ కప్‌లో విజయం సాధించామని చెప్పారు.

(వాయిస్ 20 సెకన్లు)

====================

తిరుమల శ్రీ వేంకటేశ్వర స్వామి వారి ఆలయంలో డిసెంబర్ 30 నుండి వచ్చే సంవత్సరం జనవరి 8వ తేదీ వరకు భక్తులకు వైకుంఠ ద్వార దర్శనం కల్పిస్తామని టీటీడీ ఈవో అనిల్ కుమార్ సింఘాల్ చెప్పారు. తిరుమల అన్నమయ్య భవనంలో ఈరోజు జరిగిన డయల్ యువర్ ఈవో కార్యక్రమంలో పలువురు భక్తులు అడిగిన ప్రశ్నలకు ఆయన సమాధానం ఇచ్చారు. అనంతరం ఈవో మాట్లాడుతూ.. తిరుచానూరు శ్రీ పద్మావతి అమ్మవారి ఆలయంలో ఈ నెల 17 నుండి 25వ తేదీ వరకు కార్తీక బ్రహ్మోత్సవాలు వైభవంగా నిర్వహిస్తామని వెల్లడించారు. భక్తుల సౌకర్యార్థం 25 కోట్ల రూపాయల ఖర్చుతో తిరుమలలోని ఆళ్వార్ ట్యాంక్ గెస్ట్ హౌస్ నుండి గోగర్భం డ్యాం సర్కిల్ వరకు శాశ్వత షెల్టర్, క్యూ లైన్ నిర్మించేందుకు నిర్ణయం తీసుకున్నామని తెలియజేశారు.

====================

శాస్త్ర సాంకేతిక రంగాల్లో దేశం వికసిత్ భారత్ గా అభివృద్ధి చెందాలంటే విశ్వవిద్యాలయాలు, పరిశోధనా కేంద్రాలు కలిసి పని చేయాలని నీతి ఆయోగ్ సభ్యులు వి.కె. సారస్వత్ అభిప్రాయపడ్డారు. తిరుపతిలోని శ్రీ వెంకటేశ్వర విశ్వవిద్యాలయంలో "వికసిత్ భారత్ సాధనలో శాస్త్ర సాంకేతిక రంగాల పాత్ర" అనే అంశంపై ఈరోజు జరిగిన సెమినార్ లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. దేశంలో 5 శాతం మంది విద్యార్థులు మాత్రమే ఉన్నత విద్య కోసం ప్రముఖ జాతీయ విద్యా సంస్థలకు వెళుతున్నారన్నారు.

====================
====================